# మీరూ ఆలోచించాలా?

కట్టేని వెంకట కృష్ణారావు

"సునీత డాడీ కేంప్‌నుంచి వచ్చారేవ్" వీథిగదిలోంచి మోహన్ అరిచాడు పెద్దగా.

ఉలిక్కిపడింది శారద. ఆ అదురుకు ఆమె చేయి వణికి స్టవ్‌మీదున్న పెనానికి తగిలింది. "అబ్బా" అనుకుంది అప్రయత్నంగా. ఎంత త్వరగా చెయ్యి వెనక్కు లాకున్నా చెయ్యి కాలనే కాలింది. అంగుళం బొడుగున బొబ్బ వచ్చింది. కళ్ళలో నీళ్లు పొంగాయి. బాధని ఓర్చుకుంటూనే ముందుగదిలోకి నడిచింది.

అప్పటికే రాఘవేంద్రరావు లోపలికి వచ్చి మంచంమీద కూర్చుని ఉన్నాడు. వెంట వచ్చిన అటెండర్ కేంప్‌నుంచి తెచ్చిన సామాన్లు సర్దుతున్నాడు. పిల్లలు రాఘవేంర్ద్రరావు మీద పడిపోయి కావలించేసుకుని ముద్దులు పెట్టుకుంటున్నారు. అతనూ వాళ్లని ముద్దుల్లో ముంచెత్తుతున్నాడు. ఓపికగా వాళ్ళడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్తున్నాడు.

"ప్రయాణం సుఖంగా జరిగిందాండీ?" అడిగింది శారద.

రాఘవేంద్రరావు జవాబివ్వలేదు. వినపడలేదేమో అనుకుంటూ మళ్ళీ అడిగింది. ఈ సారి అతను జవాబివ్వలేదు కాని పెద్ద కూతురు విసుక్కుంది. "ఏంటి మమ్మీ, మమ్మల్ని డిస్టర్బ్ చేస్తావ్? డాడీ ఇప్పుడే కదా కేంప్‌నుంచి వచ్చింది? కొంచెంసేపు మేం మాట్లాడుకోవద్దూ? అయినా కిచెన్‌లో ఏదో మాడిపోతున్నట్టుంది. వెళ్ళి ఆ పని చూసుకో" అంటూ.

గిరుక్కున వెనక్కు తిరిగింది శారద. కిచెన్‌లోకి వచ్చి వంటపని చూసుకుంటోందిగాని ఆమె మనసంతా ఏదోలా అయిపోయింది. కేంప్‌నుంచి వచ్చిన భర్త తనతో ఒక్కమాట... ఒక్కమాట ఆదరంగా మాట్లాడితే ఎంత బాగుంటుంది? నాలుగు రోజులై ఊళ్ళో లేరే ఆయన? ఈ నాలుగు రోజులుగా పిల్లలేనా ఆయనకోసం బెంగపెట్టుకున్నది? తనుమాత్రం. ఆయన కేంపులో ఉన్నంతకాలం ఆయనకోసం తపించిపోదూ? కేంపులో ఆయన ఎలా ఉన్నారో, ఏం ఇబ్బందులు పడుతున్నారో అని అనుక్షణం ఆరాటపడిపోదూ? అసలాయన కేంపులకు వెళ్ళిన రోజులన్నీ తను సరైన తిండీ, నిద్రా లేకుండానే గడిపేస్తుందే? ఆయన మాత్రం వచ్చీరాగానే పిల్లలతో కబుర్లలో మునిగిపోతారు. ఈలోగా ఇంటికి ఎవరైనా వస్తే వాళ్లతో కబుర్లేసుకుంటారు. లేకపోతే తనే పక్కిళ్ళకు పోయి వాళ్ళతో తన కేంప్ వివరాలన్నీ చెప్పడమో, పిచ్చాపాటీ మాట్లాడడమో చేస్తుంటారు. భార్యంటూ ఒకతె ఇంట్లో ఉందని గుర్తుండదేమో ఈయనకు? అసలు తనతో మాట్లాడటమే అరుదు. ఏ విషయం గురించీ తనను అడగరు. ఏ విషయమూ తనకు చెప్పరు. కనీసం ప్రతి చిన్న సమస్యగురించీ పిల్లలతో కూడా చర్చించే ఆయన, తనను కదిలించనే కదిలించరు. ఏమిటో. భార్యతో సంప్రదిస్తే చిన్నతనం అనుకుంటారో ఏమో?

పిల్లలూ అంతే. తల్లిపట్ల ఉండవలసిన కనీస గౌరవం కూడా లేదు వాళ్లకు. తండ్రి ఇచ్చిన అలుసుతో తల్లి అంటే భయం కూడా లేదు. తనమాటే లెక్కచెయ్యరు. వాళ్ళు ఎదురుతిరిగి ఒక్కొక్క మాటా అంటుంటే తనకు వాళ్ళతో మాట్లాడాలంటేనే భయం వేస్తోంది. వాళ్ళని కొట్టడం మాట అటుంచి ప్రాణం విసిగి ఏదన్నా చిన్నమాట అంటే చాలు, తండ్రి దగ్గర పితూరీ చెప్పేస్తారు. ఎప్పుడూ కేంపులు కేంపులంటూ తిరుగుతుంటారేమో పిల్లలంటే అమితమైన ప్రేమ ఈయనకు. వాళ్ళు తనమీద ఏదైనా చెప్పిన మరుక్షణం ముక్కచీవాట్లు పెట్టేస్తారు తనను వాళ్ళ ఎదురుగానే.

"ఏవమ్మోయ్ వంటైందా? అయితే మాకూ, డాడీకీ అన్నాలు పెట్టేయ్" మోహన్ అరుచుకుంటూ వచ్చాడు.

ఉన్నట్టుండి గుండెలదిరేలా అరుస్తాడు వాడు. వాడలా అరిచినప్పుడల్లా శారద ఏదోలా అయిపోతుంది. కొంచెంసేపు ఏమీ తోచకుండా అయిపోతుంది. ఇప్పుడూ అలాగే అయింది. "ఆ ఆ " అంది అస్పష్టంగా.

వెళ్ళి చెప్పివచ్చాడు వాడు. తండ్రీ, కొడుకూ, కూతుళ్ళు వచ్చేసి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు. పెద్దపిల్ల అపర్ణ పదహారేళ్ళది తండ్రి మెడను కావలించుకుని కూర్చుంది.

ప్లేట్లు సర్దుతూ అనుకుంది శారద. 'చేతికొచ్చిన ఆడపిల్ల అపర్ణ. తల్లి అన్న జాలి లేదు ఆమెకు. అన్నీ తనే చేసుకోవాలి. చివరకు ఆమె ఫ్రెండ్స్ వచ్చినా అందరికీ తనే అందించాలి మంచినీళ్లతో సహా. మహారాణీలా కూర్చుంటుంది. దాని వయస్సులో తల్లికెంత సహాయంగా ఉండేది తను. ఇప్పుడు తన కూతురికి చిన్న పని చెప్తే చాలు ఇంతెత్తున ఎగిరి పడుతుంది. ఆయనగారు కూతుర్ని సమర్థించడమేకాని, భార్య ఎంత అవస్థపడుతోందో, ఎందుకు చెపుతోందో అసలు ఆలోచించరు. అంతా తన కర్మ' అనుకుంది విరక్తిగా.

ఒకపక్క స్టవ్‌మీద చూసుకుంటూనే వాళ్లకు వడ్డించింది. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గలగలా నవ్వుకుంటూ తింటున్నారు వాళ్ళు.

తనకూ తన భర్తతో కలిసి అలా హాయిగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చెయ్యాలని ఆశ. కాని తన పెళ్ళయినప్పట్నుంచీ ఆ చిన్న కోరిక తీరనేలేదు. అప్పుడు అత్తమామలు అడ్డు. ఇప్పుడు కన్నబిడ్డలు అడ్డు. అయినా ఆయన మాత్రం ఒక్కనాడు అన్నారా 'నువ్వు కూడా భోజనం చేసెయ్యి శారదా' అని? ఆయన ఊళ్ళో ఉన్నప్పుడు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తారు. అప్పుడు. తనకెంత ఆనందంగా ఉంటుందో? పెద్దపిల్ల కాలేజీకి, చిన్నవాళ్ళు స్కూలుకీ వెళ్ళిపోతారు. ఇంట్లో తామిద్దరే ఉంటారు. అప్పుడైనా 'నువ్వూ వడ్డించేసుకో శారదా' అంటారేమో అని తనెంతగానో ఎదురుచూస్తుంది. ఊహూ అలా అనరే ఆయన! మౌనంగా తినేసి మళ్ళీ వెళ్ళిపోతారు హడావుడిగా. అక్కడికీ సిగ్గు చంపుకొని ఒకసారి ఆయనతోపాటు తనూ వడ్డించుకోబోయింది. అయిష్టంగా ముఖంపెట్టి "నువ్వూ ఇప్పుడే ఎందుకు" అన్నారాయన...


"ఏమిటో ఆలోచిస్తోంది డాడీ అమ్మ" చిన్నా కూతురు సునీత మాటలు విని ఈ లోకంలోకి వచ్చింది శారద.

"ఆవిడగారి తమ్ముళ్ళు గుర్తొచ్చారేమో?" అంది అపర్ణ.

పెద్దగ నవ్వాడు రాఘవేంద్రరావు బావమరుదులమీద ఏదో జోక్ వేసి. ఇక అందుకున్నారు పిల్లలు. శారద తమ్ముళ్ళ మీద ఏవేవో చెప్పుకుంటూ నవ్వేసుకున్నారు. వాళ్ళతో కలిసిపోయాడు రాఘవేంద్రరావు.


శారద కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. తనవాళ్ళని ఏదోలా హీనపరచకపోతే వీళ్ళకి రోజు గడవదు కాబోలు? వెనక్కు తిరిగింది.

"అమ్మకు కోపం వచ్చేసింది బాబోయ్" భయం నటించింది అపర్ణ.



భోజనాలు పూర్తి చేసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు కబుర్లాడుకుంటూ, గలగలా నవ్వుకుంటూ.

స్టవ్ ఆర్పి నిస్సత్తువగా ఛైర్‌లో కూలబడిపోయింది శారద. తనకు అన్నమూ మిగలలేదు, కూరలూ మిగలలేదు. అయినా తను తిన్నా తినకపోయినా ఫరవాలేదు. 'తిన్నావా' అని ఒక్కరూ అడగరు. ఇంత రాత్రివేళ, ఇంతగా అలసిపోయాక నీరసంతో తనకూ తినాలనిపించదు. ఉదయం నాలుగు గంటలకు లేచిన తను రాత్రి పది, పదకొండు వరకు అలా




ఏదో చేస్తూనే ఉంటుంది. అయినా అందరూ వంకలు పెడుతూనే ఉంటారు. అయినా కట్టుకున్న వాడికే లేని అభిమానం, జాలి బిడ్డలకొస్తాయా?

ఆమె మనసంతా చేదుగా అయిపోయింది. 'నేను ఒంటరిదాన్ని. నాకెవరూలేరు' అనుకుంది అశాంతిగా.

పన్నెండు గంటలవుతున్నట్టుంది. పిల్లలంతా నిద్రపోయారేమో నిశ్శబ్దం అయిపోయింది ఇల్లు. "శారదా?" రాఘవేంద్రరావు పిలుస్తున్నాడు. ఆయనకు ఇప్పుడు గుర్తొచ్చినట్టుంది భార్య. పిలిచింది ఎందుకో తనకూ తెలుసు. మనసు విప్పి మాట్లాడుకోవడానికి కాదు. భార్యగా ఈ విధీ నిర్వర్తించక తప్పదు కదా తనకెలా ఉన్నా?' నెమ్మదిగా లేచి బెడ్‌రూమ్‌లోకి నడిచింది.

తన పని ముగించుకుని అటు తిరిగి పడుకున్నాడు రాఘవేంద్రరావు. మరుక్షణం గాఢనిద్రలో మునిగిపోయాడు.

శారద లేచి కూర్చుంది. ఉదయం నాలుగు గంటలనుంచి విశ్రాంతి అన్నది తెలియకుండా పనిచేసినా నిద్ర రావడంలేదు. ఏదో అశాంతి మనసును పీడించేస్తున్నది. ఏం చెయ్యాలో తోచదు. మనసంతా ఏవో పిచ్చిపిచ్చి ఆలోచనలు, ఏదో నిరాశ, ఏదో నిస్పృహ. రోజురోజుకీ అశాంతి పెరిగిపోతోంది. ఇక లాభంలేదు. తన గోడు వినే ప్రాణే లేదు ఈ ఇంట్లో. అయినా తన బాధంతా వెళ్ళగక్కుకోకపోతే తను పిచ్చిదైపోతుందేమో - అనుకుంది. ఎన్నాళ్ళనించో మెదులుతోందో ఆలోచన. దాన్ని ఈవేళైనా ఆచరణలో పెట్టాలి. గమ్యంలేకుండా ఏవేవో ఆలోచనలు చేస్తున్న మనసుని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ మంచం దిగింది. పెన్నూ కొన్ని కాగితాలూ అందుకొని పక్కగదిలోకి వచ్చి కూర్చుని రాయడం ప్రారంభించింది.

"పూజనీయులైన శ్రీవారికి,

దయచేసి ఈ ఉత్తరం పూర్తిగా చదవండి. ఆ,ఏదో చాదస్తం కొద్దీ రాసిందిలే చదివేదేమిటి, అనుకుంటూ చింపి పోగులు పెట్టి చెత్తబుట్టపాలు చేయవద్దని చేతులు జోడించి ప్రార్థిస్తున్నారు.

"మీరు ఎప్పుడన్నా ఆలోచించారా మనం ఎలాంటి. జీవితం గడపాలో? నేనుమాత్రం వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు కన్నాను. మన పెళ్ళి కుదిరిన రోజునుంచీ ఆలోచించాను మన సంసారాన్ని ఏ విధంగా తీర్చి దిద్దుకోవాలో. అయితే నా రాతేమిటోగాని నేను ఊహించుకున్న వాటిలో ఏ చిన్నదీ నిజం చేసుకోలేకపోయాను.

"కాని మీరు ... మీరు భార్య అంటే కేవలం భరించవలసినదే అనుకున్నారు. నేను మీ దృష్టిలో కిచెన్‌కూ, బెడ్‌రూమ్‌కే పరిమితం. బెడ్‌రూంలో కూడా నాలో మీకు ఆడదే కనిపిస్తుందికాని అర్థాంగి కన్పించదు. మీ ప్రవర్తనతో నాలో ఏవేవో అనుభూతులు పొందాలనే కోరిక అప్పుడే నశించిపోయింది సమూలంగా.

"మీ సర్కిల్లో మాటకారిగా ఎంత మంచి పేరుంది మీకు! నాదగ్గరకొచ్చేసరికే మీరు మూగనోము పట్టేస్తారు. పలకరించినా, ఏదైనా అడిగినా 'ఆ..ఊ..' అంటూ పొడిపొడిగా సమాధానం ఇవ్వడమే కాని, సంభాషణ పొడిగించాలనుకోరు.

"మొదట్లో నేనంటే మీకు ఇష్టం లేదేమో అనుకునేదాన్ని. కాని మీరు నన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడే పెళ్ళి చేసుకున్నారని మీ పెద్దవాళ్ళనడిగి తెలుసుకున్నాను. మీరు నాపట్ల ఇలా ప్రవర్తించడానికి కారణమూ తెలుసుకున్నాను తర్వాత. భార్యకు చనువిస్తే నెత్తికెక్కుతుందేమోనని మీ భయం. భార్యతో నాలుగు ముక్కలు మాట్లాడి, ఆమెతో సంప్రదిస్తే భర్తను దాసుణ్ణి చేసేసుకుని కీలుబొమ్మలా ఆడిస్తుందని మీ అభిప్రాయం. ఇది నాకెలా తెలిసిందనుకుంటున్నారా? మన పెళ్ళయిన మూడేళ్ళకనుకుంటాను ఈ విషయాన్ని కొత్తగా పెళ్ళయిన మీ స్నేహితుడికి చెప్తుంటే విన్నాను. నిర్ఘాంతపోయాను. ఇన్నేళ్ళకు, ఇప్పుడు మీ అభిప్రాయం తప్పు అని చెప్పడానికి సాహసిస్తున్నానండీ?

"నాకు తెలుసు నాపేర ఇల్లు కొన్నారు. డబ్బు దాచారు. నాకు నగలు చేయించారు. కేవలం ఇవే ఆడదాని మనసుకు సంతృప్తినివ్వవండీ!

## అమ్మా మాదా కబళం

అమ్మా...
మాదా కబళం తల్లీ!
అవిటివాణ్ణి కాను
గుడ్డివాణ్ణి కాను
ముసలివాణ్ణి
అసలే కాను -
యూనివర్శిటీ
రంగు రంగుల కలలు
కరిగి, కరిగీ
ఆర్థిక శాస్త్రంలో
డాక్టరు బిరుదు
పొందిన వాణ్ణి!
అమ్మా ఆకలి;
ఆకలి నేస్తాలతో
చేయి చేయి కలిపి
పస్తు పరుపులపై
పవ్వళిస్తున్న వాణ్ణి!
కన్న వాళ్ళకు
కడుపు చిచ్చు రగిల్చి
నిరాశల సమాధులపై
అంధకారం
మిగిల్చిన వాణ్ణి!
ప్రభువుల
చేతకాని తనంలో
భవిష్యత్ 'చావ'
చచ్చిన వాణ్ణి
అమ్మా! ఆకలి!
కన్నతల్లి కడుపుశోకాన్ని
తీర్చలేని అభాగ్యుణ్ణి
శోకం ఎడారిలో
గమ్యం ఎరుగని వాణ్ణి
నరాల బిగువు సడలి
కాయకష్టానికి
అవయవాలు
కదిలించలేని వాణ్ణి.
అమ్మా ఆకలి
మాదా కబళం
వెయ్యి తల్లీ!

చల్లా దుర్గాప్రసాద్

అసలివేమీ అక్కర్లేదు. భర్త ఆదరంగా నాలుగు మాటలు మాట్లాడితే, సమస్యలు తనతో పంచుకుంటుంటే, మంచికీ; చెడుకీ తనను సంప్రదిస్తుంటే - అది చాలండీ ఆడదాని జీవితానికి? నేను పిల్లలను, మిమ్మల్ని కనిపెట్టుకుని ఉండటానికే ఉద్యోగానికి రాజీనామా చేశానని మీకు తెలును.

"ఇక పిల్లల గురించి... వాళ్ళగురించి, వాళ్ళ ప్రవర్తన గురించి నేనేదైనా చెప్పబోతే చాలు 'నా పిల్లలు వాళ్ళు - వాళ్ళ బాగోగులు నాకు తెలుసు' అని కసురుకుంటారు. వాళ్ళు మీ పిల్లలేనా? ఒక్కొక్కళ్ళనీ తొమ్మిది నెలలు మోశాను. ఒక్కొక్క కాన్పూ ఒక్కొక్క ప్రాణగండంగా గడిచింది నాకు. వాళ్ళని ప్రాణప్రదంగా పెంచుకొచ్చాను. వాళ్ళని ఎలా, ఎంతో క్రమశిక్షణతో పెంచుకోవాలనుకున్నాను. ఏమైంది ఇప్పుడు? చుట్టుపక్కల వాళ్ళు తమ పిల్లలు కూడా పాడైపోతారని వాళ్ళను మన పిల్లలతో చేరనివ్వడంలేదు. అంటే మన పిల్లలు ఎలా అయ్యారో అర్థం చేసుకోగలరు కదూ? వాళ్ళెందుకలా


పి.జానకిరామయ్య [హైదరాబాదు]

తయారయ్యార్సు ? కేవలం.... అవును కేవలం మీ గారాబంవల్ల కాదూ? మీరు ఎలాగూ కేంపులంటూ ఊర్లో ఉండరు. ఇంటిపట్టున ఉన్న తల్లి మాట అంటే లెక్కలేకుండా తయారుచేశారు వాళ్ళని మీ ప్రవర్తనతో. పైగా మీరు అస్తమానం 'నా పిల్లలు, నా పిల్లలు' అంటూంటే నేను ఎంతటి రంపపుకోత అనుభవిస్తుంటానో తెలుసా? పిల్లల ముందు మీ అర్ధాంగిగా మీతోపాటు నన్నూ సమానస్థాయిలో ఉంచవలసిన బాధ్యత మీకు లేదూ? తండ్రిగా మీరు చెయ్యవలసిన పని కాదండీ, తల్లిని హీనపరచడం!

"పదహారేళ్ళ పిల్ల అవర్ణ. అది ఒక్క చిన్న సహాయం చేస్తోందా నాకు! కనీసం మంచినీళ్ళు కూడా పెట్టుకోదే. ఎల్లకాలం దానికి అలానే గడిచిపోతుందాండీ?

"నా పుట్టింటిని గురించీ, నా తమ్ముళ్ళను గురించీ మీరు హీనంగా పిల్లలకు ఎందుకు చెప్తారో నాకు అర్థం కాదు. మా వాళ్ళు మీకు చేసిన అపకారమేమిటీ? నిజమే? వాళ్ళు మీకంటే చిన్న ఉద్యోగాలే చేస్తున్నారు. అయితేమాత్రం మీరు వాళ్ళను హీనంగా చూడక్కర్లేదే? తేలిగ్గా మాట్లాడనక్కరలేదే? మీ మాటల వల్ల మన పిల్లల మనసుల్లో ఎలాంటి భావాలు ఏర్పడుతున్నాయో గ్రహించారా? మొన్న మా పెద్ద తమ్ముడు వచ్చినప్పుడు 'మామయ్యా' అని పిలవడానికి మన పిల్లలు సంకోచించాను. బయటివాళ్ళకు 'మా మామయ్య' అని పరిచయం చెయ్యడానికి జంకారు. ఇదంతా మావాళ్ళు ఆర్థికంగా మనతో సమానమైన హెూదాలో లేరనే కదా? మా తమ్ముడు ఎంత బాధపడుతూ వెళ్ళాడో తెలుసా?

"ఆప్యాయత, అనురాగం ఉండాలి మనుషుల మధ్య. డబ్బు లేనంతమాత్రాన బంధుత్వాన్ని కాదనుకోకూడదండీ. పిల్లల దగ్గర తల్లిని చులకన చేస్తున్నారు. భర్తగా మీరు నాకు ఇవ్వవలసిన స్థానం ఇస్తున్నారా?

"ఈ ఇంట్లో నేను పనిమనిషిని. చాకిరీ చేసినందుకు ఇంత ముద్ద పడేస్తున్నారు. నాకు నీడ కల్పిస్తున్నారు. అంతేనా? నాకు మీ జీవితంలో భాగం లేదా? మీ ఆనందంలో పాలుపంచుకోవడానికి నాకు హక్కు లేదా?

"నా పట్ల పిల్లలకు ఎంత నిర్లక్ష్యభావం ఉందో తెలుసా? మొన్న మీరు కేంప్‌కి వెళ్ళిన మర్నాడు నాకు బాగా జ్వరం వచ్చింది. అసలు ఏం జరుగుతోందో కూడా తెలియకుండా పడిపోయాను. పెద్ద పిల్ల కాలేజీ, చిన్నవాళ్ళు స్కూలు మానేసి ఇంట్లో కూర్చుని ఎవరి ఫ్రెండ్స్‌ను వాళ్ళు తీసుకొచ్చి నానాగోల చేశారు. రెండో రోజుకూ నా జ్వరం తగ్గలేదు. నామీద బాగా విసుక్కుని ముగ్గురూ బయటకు పోయి ఏవేవో తిని వచ్చారు. కనీసం నాకు ఒక టాబ్లెట్ తెచ్చి ఇచ్చిన పాపాన పోలేదు ఎవరూ. ఆ మధ్యాహ్నం ఆఫీసు నుంచి వచ్చిన అటెండర్ రాము నా పరిస్థితి చూసి కంగారుపడిపోయి డాక్టర్ని పిలుచుకు వచ్చాడు. ఇరుగుపొరుగు వాళ్ళకు అప్పుడు తెలిసిందట నాకు జ్వరమని. వాళ్ళంతా వచ్చారు. ఆ రెండు రోజులూ వాళ్ళే అన్నీ చేసిపెట్టారు. బయటివాళ్ళు నన్ను చూసి పడిన బాధలో వెయ్యోవంతు పడలేకపోయారే నా పిల్లలు? మీరుమాత్రం? అటెండర్ మీకు చెప్పే ఉంటాడు నాకు జ్వరం వచ్చిన సంగతి. అయినా మీరు అడిగారా? వచ్చీ రాగానే పిల్లలతో కబుర్లలో పడిపోయారు - కనీసం ఎలా ఉందని అడగనైనా అడక్కుండా. ఆ తర్వాత మాత్రం. అసలా ప్రసక్తే లేనిదే? ఏం పాపం చేశాననండీ నాకీ శిక్ష?

"మీ ప్రవర్తనా, పిల్లల ప్రవర్తనా నాలో ఎటువంటి ఆలోచనలను కలిగిస్తున్నాయో తెలుసా?

'నేను ఒంటరిదాన్నయిపోయాననిపిస్తోంది. నిజమే? నేను ఒంటరిదాన్నే. భర్త నన్ను పట్టించుకోడు. పిల్లలు నాకు కాకుండా పోయారు. మీకు తెలుసుననుకుంటాను భరించలేని ఒంటరితనం కూడా ఒక్కొక్కసారి ఆత్మహత్యకు కారణమౌతుందని.

"ఒక్కటేనండీ నేను కోరేది? మీరు మారాలి. భార్య అంటే అర్ధాంగి అని కూడా తెలుసుకోవాలి. పిల్లల్ని ఎలాగూ నా చెయ్యి దాటిపోయేలా చేశారు. వాళ్ళు మీ చెయ్యికూడా దాటకుండా చూసుకోవాలి. వాళ్ళు 'మన పిల్లలు' అని మీరు గుర్తించాలి. వాళ్ళముందు మీరూ తక్కువ కాకూడదు, నేనూ పలుచన కాకూడదు. మీవాళ్ళూ, మావాళ్ళూ పిల్లలకు గౌరవనీయులుగానే ఉండాలి. ఆలోచిస్తారు కదూ?

మీ శారద,

రాసిన ఉత్తరాన్ని భర్త జేబులో పెట్టింది శారద. తన అదృష్టం కొద్దీ అతనా ఉత్తరం పూర్తిగా చదివితే ఆ తర్వాత అతను తీసుకొనే నిర్ణయమే తెలుపుతుంది తను జీవించాలో, అక్కర్లేదో అనుకుంటూ.

** ** **

డియర్ సార్! రాఘవేంద్రరావు స్థానంలో మీరున్నారా? శారదస్థానంలో మీ శ్రీమతి లేరు కదా? ఉంటే మాత్రం శారద రాసిన ఉత్తరం చదివి మీరూ ఒక్కసారి ఆలోచించండి, మీరు మీ శ్రీమతికి సరైన స్థానం ఇస్తున్నారో లేదో? ★

## ఏమీలేదు

గంటనుంచి ఇల్లెరెగిపోయేలా వినిపిస్తున్నాయి తిట్లు వంటింట్లోనుంచి.

కోపంగా లోనికి వెళ్ళి - "ఏమిటే - ఎవర్ని నువ్వు తిడుతున్నది? నన్నా? నీ కొడుకునా?" భార్యని నిలదీశాడు సన్యాసిరావు.

"ఆc... నిన్నే తిడుతున్నా... అయితే ఏంటీ?" గయ్యిమంటూ లేచిం దతని భార్యామణి.

"నన్నయితే పర్లేదులే. వాడినేమో అనుకున్నా..." అన్నాడు సన్యాసిరావు భుజాలెగరేసి.

"ఆహా... అయితే వాడినీ తిడుతున్నా ఏంటంటా?" మళ్ళీ గయ్యిమంది ఆ గయ్యాళి.

"వాడిని తిడుతున్నావా... అయితే నాకేంటీ?" అని వీరోచితంగా తోక ముడిచాడు సన్యాసిరావు.

-ఎస్. బి. ప్రసాద్ [సూర్యాపేట]

